

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	35.0	27.0
భద్రాద్రి	38.0	26.0

పట్టాలెక్కనున్న ప్రగతి



ఎన్నికల కోడ్ ముగియడంతో క్షేత్రస్థాయిలోకి మంత్రులు

- నేడు, రేపు జిల్లాలో సంయుక్తంగా పర్యటన
- శాఖల వారీగా సమీక్షలు.. అభివృద్ధి పనుల పరిశీలనలు..
- ప్రతిష్ఠాత్మక సీతారామ ప్రాజెక్టు పూర్తిపై ప్రత్యేక దృష్టి

ఖమ్మం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ, లోక్‌సభ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రగతిని పరుగులు పెట్టించేందుకు, పాలనను పకడ్బందీగా సాగించేందుకు అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధ, గురువారాల్లో జిల్లాలో పర్యటించబోతున్నారు. బుధవారం ఉదయం 9-30 గంటలకు ఖమ్మం ఎస్ఆర్‌బీ ప్రభుత్వ పాఠశాలలో విద్యాసంవత్సరం ప్రారంభించి విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేయనున్నారు. ఆ తర్వాత 11 గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌లో సాగునీటి ప్రాజెక్టులు, విద్యా, సంక్షేమపథకాల అమలు తీరుపై సమీక్షలు నిర్వహించనున్నారు. ఈ సమీక్షలో సీతారామ ప్రాజెక్టు పనుల పరిస్థితి, వ్యవసాయం, విద్యాశాఖల పరంగా వైద్యారోగ్యశాఖల పరంగా తీసుకోవాల్సిన చర్యలు, జిల్లాలో ఎన్ఎస్‌పీ కాలువలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు, చెరువుల మరమ్మతులపై చర్చించనున్నారు.

అలాగే జిల్లాలో ఏర్పాటైన మెడికల్ కాలేజీకి వసతుల కల్పన, శాశ్వత భవనాల నిర్మాణం, ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లిలో ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూ కళాశాలలో వసతులు, సమస్యలతోపాటు అక్కడ మౌలిక వసతులు, సదుపాయాలు, వచ్చే విద్యా సంవత్సరానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. సత్తుపల్లిలోని ఫుడ్‌పార్కులో వసతుల కల్పన, అలాగే ఖమ్మంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యపై కూడా సమీక్షలో చర్చించే అవకాశం ఉంది. ఖమ్మం, పాలేరు, మధిర, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలపైనా ముగ్గురు మంత్రులు అధికారులకు దశ, దిశ ఇవ్వనున్నారు.

అనంతరం మధ్యాహ్నం 3:30 గంటలకు మధిర నియోజకవర్గంలోని వందనం, పుట్టకోట, పాతర్లపాడు, గోవిందాపురం గ్రామాల మధ్య పీఆర్ రోడ్ల పనులకు శంకుస్థాపన, గురువారం ఉదయం 8-30 గంటలకు సీతారామ ప్రాజెక్టు పనులను, అశ్వాపురం మండలంలోని గోదావరి నది దుమ్ముగూడెం వద్ద సీతమ్మసాగర్‌తోపాటు సీతారామ ఎత్తిపోతల పనులు పరిశీలిస్తారు. లిఫ్టు ఇరిగేషన్ రెగ్యులరేటరీ పనులను అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద పంపు హౌస్ కెనాల్ పనులను, ములకలపల్లి మండలంలోని పంపు హౌస్ 2, పూసుగూడెంలోని పంపుహౌస్ 3 పనులను పరిశీలిస్తారు. కమలాపురం, వయా పాల్వంచ, కొత్తగూడెం, జూలూరుపాడు మీదుగా ఉన్న ఏన్కూరు లింక్ కెనాల్ పనులను మంత్రులు పరిశీలించనున్నారు. నత్తనడకన నడుస్తున్న ఈ ప్రాజెక్టు పనులను పరిశీలించి అధికారులకు దశ, దిశ నిర్దేశించనున్నారు.

సీతారామ ప్రాజెక్టు పనులను గత ప్రభుత్వం రూ.15వేల కోట్లతో చేపట్టింది. మరో రూ.3వేల కోట్లతో సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణం చేపట్టింది. అయితే ఇప్పటివరకు రూ.8వేల కోట్లు ఖర్చుచేసినా ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదు. లిఫ్టులు ఏర్పాటు చేసినా.. వాటికి అనుసంధానంగా కాలువల పనులు పూర్తికాకపోవడంతో ఇప్పటివరకు ఒక్క ఎకరానికి సాగునీరు అందని పరిస్థితి. దీంతో మంత్రుల బృందం అధికారులతో కలిసి సమష్టిగా సీతారామ ఎత్తిపోతల లిఫ్టు, బ్యారేజీతో పాటు ఇతర లిఫ్టులను పరిశీలించి పెండింగ్ పనులను పూర్తిచేయడానికి చర్యలు చేపట్టనున్నారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి వద్దనే ఆర్థికశాఖ ఉన్నందున ఈ ప్రాజెక్టుకు సంబంధించి నిధుల కేటాయింపుకోసం తక్షణ అవసరాలకోసం నిధులు మంజూరుకు ఈ ప్రాజెక్టును పరిశీలిస్తున్నారు. వచ్చే ఆగస్టు 15 నాటికి జిల్లాలో గోదావరి జలాలను వైరాకు అనుసంధానం చేయాలన్న లక్ష్యంతో పనులు నడుస్తున్నాయి. ఉమ్మడిగా రెవెన్యూ, నీటిపారుదల తోపాటు పలుశాఖల అధికారులతో కలిసి పనులు పరిశీలన, సమీక్ష చేయడం ద్వారా జిల్లాలో సీతారామ సాగునీటి ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యే అవకాశం ఉంది.



మృతురాలు షేక్ రహీన

ప్రేమ పేరుతో వంచన

- మనస్తాపంతో యువతి ఆత్మహత్య
- మొలుగుమాడు గ్రామంలో విషాదం

ఎర్రుపాలెం జూన్ 11: ప్రేమించిన వ్యక్తి చేతిలో మోసపోయానని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మొలుగుమాడు గ్రామానికి చెందిన ఓ యువతి ఆత్మహత్యకు మంగళవారం పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొలుగుమాడు గ్రామానికి చెందిన షేక్ రహీన(23) హైదరాబాద్‌లో ఓ బ్యూటీపార్లర్‌లో పనిచేస్తోంది. ఈ క్రమంలో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం, రంగాపురం గ్రామానికి చెందిన ఇస్లావత్ క్రాంతికుమార్‌తో 2020లో ఇన్స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. వీరిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకోవటంతో పాటు తరచూ కలుసుకునేవారు. కానీ తరువాత క్రాంతికుమార్ రహీనను కాదని, గత ఏప్రిల్ నెలలో మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రహీన తాను మోసపోయానని మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. విచారణ చేసిన పోలీసులు క్రాంతికుమార్‌ను అరెస్టు చేసి సత్తుపల్లి సబ్‌జైలుకు రిమాండ్ చేశారు. అయితే ఈ నెల 10న అతడు బెయిల్‌పై విడుదల కావడంతో విషయం తెలుసుకున్న రహీన తనకు న్యాయం జరగలేదని మనస్థాపంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరులేని సమయంలో తన చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రహీన తండ్రి మాబు సాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎర్రుపాలెం ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

బడి గంటలు మోగే వేళ..



- నేటి నుంచి పాఠశాలల పునః ప్రారంభం
- ముగిసిన వేసవి సెలవుల సందడి
- తరగతి గదులకు విద్యార్థుల కళ
- కొత్త ఏడాదిలోనూ పాత సమస్యలే..
- నత్తనడకన 'అమ్మ ఆదర్శ పాఠశాల' పనులు
- అనేక పాఠశాలల్లో కనీస వసతులు కరువు

ఖమ్మం ఖానాపురం హవేలి/లక్ష్మీదేవిపల్లి(కొత్తగూడెం), జూన్ 11: నిన్నటిదాకా సెలవుల్లో సరదాగా గడిపిన విద్యార్థులు ఇక పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతున్నారు. వేసవి సెలవులకు వీడ్కోలు పలికి బుధవారం నుంచి బడిబాట పట్టనున్నారు. నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాఠశాలలు బుధవారం పునఃప్రారంభం కానున్నాయి. అయితే ఈ ఏడాది కూడా పాత సమస్యలే విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి. ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వం అనేక ప్రణాళికలు రూపొందించుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభం రోజే పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ విద్యార్థులకు ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. సమస్యలు లేకుండా స్కూళ్లను ప్రారంభించాలని, విద్యార్థులకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని సూచించింది. కానీ ఎప్పటిలాగే ఈ ఏడాదీ అరకొర వసతులతోనే ప్రభుత్వ బడులు ప్రారంభం కాబోతున్నాయి. మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ విద్యా వ్యవస్థకు దీటుగా తీర్చిదిద్దేందుకు 'మన ఊరు మన బడి' స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసినా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు పూర్తయిన చోట పాఠశాలలు మెరుగుపడ్డాయి. టీచర్ల ఖాళీలు షరా మామూలుగానే ఉన్నాయి. స్కూల్స్ ప్రారంభం నాటికే ఖాళీ పోస్టుల్లో విద్యా వలంటీర్లను నియమిస్తామని చెప్పినా.. ఇప్పటివరకు ఏర్పాట్లు జరగలేదు. బడిబాట ఈ నెల 19వరకు

(మిగతా 4వ పేజీలో)

బడి బస్సులు భద్రమేనా..?

50 శాతం బస్సులకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 11: వేసవి సెలవుల కాలంలో విద్యార్థుల అడ్మిషన్‌పై దృష్టి సారించిన ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలు విద్యార్థులను నిత్యం తరలించే బస్సులపై దృష్టి సారించలేదు. పాఠశాలలు ప్రారంభానికి పక్షం రోజులు ముందుగానే పాఠశాలల బస్సులు రవాణాశాఖ అధికారుల వద్ద తనిఖీలు పూర్తి చేయించుకొని ఫిట్‌నెస్ ధ్రువపత్రాలను పొందాల్సి ఉంటుంది. ఖమ్మం జిల్లాలో మొత్తం 648 బడి బస్సులు ఉండగా వాటిలో మంగళవారం నాటికి 300 బస్సులకు ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. మరో 348 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రాకుండానే విద్యార్థులను తరలించేందుకు బుధవారం నుంచి రోడ్డెక్కనున్నాయి. ఈ విషయంపై జిల్లా రవాణాశాఖ అధికారి ఆఫ్రీన్ సిద్దికిని వివరణ కోరగా బస్సులకు ఏడాది పాటు ఫిట్‌నెస్ ధ్రువపత్రాలను పంపిణీ చేస్తామని, ఏడాది లోపు ఎప్పుడైనా ఫిట్‌నెస్ చేయించుకోనే వీలు ఉందన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి..

అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్ 4



సైకిల్‌పై వెళ్తున్న టీడీపీ అభిమాని

ప్రమాణానికి ప్రయాణం

బాబు కోసం సైకిల్‌పై బయలుదేరిన లక్ష్మణ్

ఖమ్మం మామిళ్లగూడెం, జూన్ 11: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారానికి ఓ అభిమాని ఖమ్మం నుంచి సైకిల్‌పై ఏపీకి తరలివెళ్లాడు. గన్నవరం ఎయిర్‌పోర్టు సమీపంలో కేసరపల్లి ఐటీ పార్కు వద్ద బుధవారం జరగబోయే చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ఖమ్మంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన సీనియర్ తెలుగుదేశం కార్యకర్త లక్ష్మణ్ టీడీపీపై ఉన్న అభిమానంతో ప్రమాణస్వీకార ప్రాంతానికి సైకిల్‌పై మంగళవారం బయలుదేరాడు. ఖమ్మం టీడీపీ ఆఫీసు నుంచి ఆయన సైకిల్‌పై బయలుదేరాడు. ఆయన యాత్రకు టీడీపీ ఖమ్మం పార్లమెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ జెండా ఊపి ప్రారంభించారు. లక్ష్మణ్‌ను పలువురు అభినందించారు. బుధవారం జరిగే చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమంలో లక్ష్మణ్ సందడి చేయనున్నాడు.



మళ్లీ తెరపైకి బీటీపీఎస్

- ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు
- నెలాఖరులోగా వివరణ ఇవ్వాలని విచారణ కమిషన్ ఆదేశం

మణుగూరు, జూన్ 11:గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భద్రాద్రి థర్మల్ ప్లాంట్ ప్రాజెక్టు నిర్మాణంలో వచ్చిన ఆరోపణపై విచారణకు రంగం సిద్ధమైంది. సబ్ క్రిటికల్ విధానంలో నిర్మించిన ఈ ప్రాజెక్టు పనుల్లో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణంపై విచారణ చేపట్టింది. 2015లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ బీటీపీఎస్‌కు భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. తొలి ఏడాది నిర్మాణ పనులు సజావుగానే సాగినా.. ఆ తర్వాత మూడేళ్ల పాటు పనులు నిలిచిపోయాయి. ఎన్‌జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) అనుమతులు పొందిన తరువాత మళ్లీ పనులు పునఃప్రారంభమయ్యాయి. నిర్మాణ బాధ్యతలను స్వీకరించిన బీహెచ్ఈఎల్ 1,178 ఎకరాల్లో బీటీపీఎస్ నిర్మాణానికి పనులు ప్రారంభించింది. సుమారు రూ.10వేల కోట్లతో 1,080 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన సామర్థ్యంతో నాలుగు యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేసి పనులు చేశారు. దీని నిర్మాణంలో 60కి పైగా ప్రైవేట్ కంపెనీలు పాలు పంచుకున్నాయి. 2022లో నాలుగు యూనిట్ల నిర్మాణాలు పూర్తి చేసి సీఓడీని పూర్తి చేశారు. అయితే ప్లాంట్ నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో ప్రస్తుత ప్రభుత్వం దీనిపై విచారణకు ఆదేశించింది. విచారణ చేపట్టిన జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ నాటి ముఖ్యమంత్రి పాలనాపరంగా నిబంధనలు పాటించకుండా వ్యవహరించారని పేర్కొన్నట్టు తెలిసింది. ఈ విషయంపై నాటి సీఎం కేసీఆర్ నెలాఖరులోగా వివరణ ఇవ్వాలని కమిషన్ కోరింది. ఈ నేపథ్యంలో బీటీపీఎస్ మళ్లీ వార్తల్లోకి వచ్చింది.

సీఐలకు స్థానచలనం

ఖమ్మం క్రైం, జూన్ 11:ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ పోలీసుశాఖ నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖమ్మం సీఎస్బీ 3 సీఐగా ఉన్న కె.సతీష్‌ను పాల్వంచ టౌన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. అక్కడ సీఐగా ఉన్న వినయ్‌కుమార్‌ను మల్టీజోన్ వన్‌కు, ఖమ్మం డీటీసీ సీఐగా ఉన్న పి.వెంకన్నను వరంగల్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా ఇల్లెందు ఎస్‌హెచ్‌వోగా ఉన్న టి.కరుణాకర్‌ను మల్టీజోన్1కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నిజామాబాద్ కంట్రోల్‌రూం సీఐగా ఉన్న బత్తుల సత్యనారాయణను నియమించారు. ఈ మేరకు పోలీసుశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదేవిధంగా జిల్లాలో మరో రెండు రోజుల్లో మరిన్ని బదిలీలు జరగనున్నట్టు తెలుస్తోంది.

టీచర్ల బదిలీలపై అభ్యంతరాలు

ఖమ్మం, ఖానాపురం హవేలి, జూన్ 11: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఆఫ్‌లైన్లో 70 అభ్యంతరాలు వచ్చాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆన్‌లైన్లో వచ్చిన అభ్యంతరాలు మంగళవారం సైట్ ఓపెన్ కాకపోవటంతో బుధవారం పరిశీలిస్తామని తెలిపారు. ఆఫ్‌లైన్లో వచ్చిన 70 అభ్యంతరాల్లో 40 అభ్యంతరాలను పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలిన 30 అభ్యంతరాలను తిరస్కరించినట్లు తెలిపారు.

ఐటీఐలో రేపు జాబ్‌మేళా

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 11: పేటీఎంలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన యువకులు ఉపాధికల్పన శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే జాబ్‌మేళాకు హాజరుకావాలని కొండపల్లి శ్రీరాం తెలిపారు. మొత్తం 100 పోస్టులకుగాను పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులు అర్హులని తెలిపారు. నెలకు రూ.15వేల నుంచి 25 వేల వేతనం ఇస్తారని చెప్పారు. 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల యువకులు ఖమ్మం శివారులోని టేకులపల్లిలో గల ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించే జాబ్‌మేళాకు హాజరవ్వాలని కోరారు.



కొత్తగూడెంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రజలందరికీ 'సంక్షేమం' అందాలి

- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలంటేనే ప్రభుత్వమని, అలాంటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరేలా ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజలెవరూ ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కొత్తగూడెంలోని కలెక్టరేట్‌లో మంగళవారం రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని ప్రజాపాలన కోసం తమను ఎన్నుకున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా అధికారులు ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలను సంప్రదించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు, విద్యా, వైద్యం, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కల్వర్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వితంతు మహిళలకు, ఒంటరి మహిళలకు, ఆసరా పెన్షన్లు అందేలా చూడాలన్నారు.

వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.39వేల కోట్లు ఖర్చు చేసినా గ్రామాల్లో మిషన్‌భగీరథ తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగానే ఉందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత భగీరథ ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాల్లోని ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టామన్నారు. ఆగస్టు 15నాటికి రైతులందరికీ రుణమాఫీ చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. సమావేశం అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు.

సమీక్ష సమావేశంలో భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కొత్తగూడెం, పినపాక, ఇల్లెందు, భద్రాచలం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ, కలెక్టర్ ప్రియాంక అలా, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, జేసీ వేణుగోపాల్, డీఆర్‌వో రవీంద్రనాథ్, కొత్తగూడె ఆర్డీవో మధు, భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, డీఎఫ్‌వో కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణ స్థలంలో ఉన్న షెడ్డును కూల్చివేసిన రెవెన్యూ అధికారులు

బీఆర్ఎస్ నాయకుడు ఆక్రమించిన

ప్రభుత్వ భూమి స్వాధీనం

అక్రమ కట్టడం కూల్చివేసిన రెవెన్యూ అధికారులు

కూసుమంచి, మే 11:మండలంలోని నాయకన్‌గూడెం గ్రామంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుడి ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల గ్రామానికి వచ్చిన రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనలో ముస్లిం సోదరులకు చెందిన ఈద్గా భూమితో పాటు, పలువురు దళితులకు చెందిన అస్సైన్‌మెంట్ భూమి ఆక్రమణపై గ్రామస్థులు మంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు విచారించిన కూసుమంచి రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూసుమంచి తహసీల్దార్ సురేష్‌కుమార్ సుమారు 20కుంటల భూమి ఆక్రమణకు గురైందని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అందులో అక్రమంగా నిర్మించిన షెడ్‌ను జేసీబీ సాయంతో కూల్చివేశారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

కలెక్టరేట్ ఎదుట వంట కార్మికుల ధర్నా

- మంత్రి పొంగులేటికి వినతిపత్రం

కొత్తగూడెం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వంట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనవాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో పని చేస్తున్న వంట కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కనీసం రూ.10వేలు వేతనం ఇస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం వంట కార్మికులకు నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు, సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అల్పాహారం, స్నాక్స్, వండిన పనికి పారితోషకం అందించాలని, ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డు, యూనిఫాం, అమలు చేయాలని వంట కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మంగ, ప్రభావతి, ముత్యాయలు, రమణ, కే.అరుణ, ఎం.పద్మ, క్రాంతి, సరళ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వాంతులు, విరేచనాలు

- ఆసుపత్రుల బాట పడుతున్న ప్రజలు
- వాతావరణంలో మార్పులే కారణమంటున్న వైద్యులు

బోనకల్, జూన్ 11: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. చిన్నారుల నుంచి పెద్ద వయస్సు వరకు అతిసారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు అందుబాటులో ఉన్న గ్రామీణ వైద్యులతో వైద్యం చేయించుకుంటుండగా మరికొందరూ పట్టణాల్లో ఉన్న ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని బోనకల్, ఆళ్లపాడు, గోవిందాపురం(ఎల్), రావినూతల గ్రామాల్లో వాంతులు, విరోచనాలతో బాధపడే వారు ఎక్కువగా ఉన్నట్టు తెలిసింది. ఆళ్లపాడులో మూడేళ్ల బాలుడికి వాంతులు, విరోచనాలు కావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా దాదాపు రూ.70వేలు ఖర్చు అయినట్టు తెలిసింది. గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన షేక్ మదార్ సాహెబ్, షేక్ మునాఫ్‌లు బోనకల్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత నాలుగు రోజులుగా ఆసుపత్రులకు వచ్చేవారి సంఖ్య పెరిగింది.



బోనకల్‌లో చికిత్స పొందుతున్న దృశ్యం

వాంతులు, విరోచనాలు వచ్చి తగ్గిపోతుండగా.. వాతావరణంలో మార్పులు, తీసుకనే ఆహారం, నీటి కాలుష్యం వల్ల వాంతులు, విరేచనాలు అవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారులపై

ఎమ్మెల్యే పాయం గుస్సా

- ఆరేళ్ల క్రితం మంజూరైన పనులపై మండిపాటు



మణుగూరుటౌన్, జూన్ 11: ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులుపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మండిపడ్డారు. ఆరేళ్ల క్రితం మంజూరైన పనులు చేయకపోవడంపై నిలదీశారు. వివరణ ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తుండగా.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకుని ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య కో-ఆర్డినేషన్ లేకపోతే ఎలా.. అంటు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివిధ శాఖల అధికారలతో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాయం నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ఎస్ఈ తన శాఖ పనులకు సంబంధించిన నివేదిక వివరాలను వెల్లడించినప్పుడు పినపాక నియోజకవర్గం పేరునే ఉచ్చరించలేదని ప్రత్యేకంగా ఎమ్మెల్యే పాయం సమీక్షలో ప్రస్తావించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 2018 ఏప్రిల్ 5న కరకగూడెం నుంచి గుండాలకు సంబంధించిన బీటీ రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయని ఆ పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అదేవిధంగా సారపాక నుంచి ఏటూరునాగారం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరయ్యాయని ఆ పనులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. దీంతో కరకగూడెంలో నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించి పైప్‌లైన్ కనెక్షన్‌ను ఎందుకు ఇవ్వలేదని ఆర్‌డబ్ల్యుఎస్ అడిగారు. కాగా అర్‌అండ్‌బీ అధికారులు బీటీ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ క్లియరెన్స్ లేదని చెప్పబోవడంతో క్లియరెన్స్ విషయంలో అధికారుల మధ్య కో-ఆర్డినేషన్ లేకపోతే ఎలా అంటూ మంత్రి పొంగులేటి జోక్యం చేసుకుని అధికారులను మందలించారు. సారపాక ఏటూరునాగరం బీటీ రోడ్డు విషయమై ఎన్‌హెచ్ అథారిటీ అధికారులు మాట్లాడుతూ.. గతంలో మంజూరైన నిధులు రద్దు అయ్యాయని ప్రస్తుతం మళ్లీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి పూర్తి స్థాయి ప్రతిపాదనలు పంపామని వివరణ ఇచ్చారు.



మొలకెత్తిన పత్తిని పరిశీలిస్తున్న ఏవో బాలాజీ

విత్తనం మొలిచే...రైతు నవ్వే

- తొలకరికి నాటిన విత్తనాలు మొలిచే
- పత్తి సాగు వైపు రైతన్న దృష్టి
- మొలిచిన పత్తిని పరిశీలించిన వ్యవసాధికారులు

కొణిజర్ల, జూన్ 11: ఇటీవల కురిసిన రెండు వర్షాలకు రైతులు పొలం పనులవైపు దృష్టి సారించారు. తొలకరికి అదునుపోతుందని బావిస్తున్న రైతులు దుక్కులు దున్ని పత్తిని సాగు చేస్తున్నారు. వరుణుడిపై భారం వేసి సాగుపైనే దృష్టి సారించారు. గత రెండు, మూడేళ్ల నుంచి అనుకున్న విధంగా రైతులకు దిగుబడి రాకపోవడంతో రైతులు మరల ఆశను చంపుకోలేక పత్తిపై దృష్టి పెట్టారు. ఇప్పటికే రైతులు మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో పత్తిని సాగుచేశారు. నాటిన పత్తి మొలిచి చిగురిస్తుండటంతో రైతుల మోములో ఆనందం వ్యక్తం అవుతుంది. గతేడాది మండలంలో 14,800 ఎకరాల్లో పత్తిసాగు చేశారు. ఈ ఏడాది కూడా అదే మొత్తంలో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అరకొరగా కురుస్తున్న వర్షాలకు పత్తి చిగురిస్తోంది. గతేడాది రైతులు పత్తి ఏపుగా పెరుగుతున్న సమయంలో రోగాలు రావడంతో ఎన్ని పెట్టుబడులు పెట్టినా ఆశించిన పత్తి చేతికి రాలేదని దిగాలుపడ్డారు. ఈ సారైన పత్తి కలిసిరావాలని రైతులు కోరుతున్నారు.

మొలిచిన పత్తిని పరిశీలించిన వ్యవసాయాధికారులు

కొణిజర్లలో మొలిచిన పత్తిపంటను మంగళవారం మండల వ్యవసాయాధికారి బాలాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే పత్తినిసాగు చేశారని, మరో వర్షం పడితే మండల వ్యాప్తంగా రైతులంతా పత్తిని సాగు చేస్తారని తెలిపారు. ప్రస్తుతం పత్తిని సాగు చేయడం వల్ల ఇబ్బందిలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సరితా, కుమార్‌రాజా, రైతులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం, విజయవాడకు

నూతన సర్వీసులు

సత్తుపల్లి ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిరూరల్, జూన్ 11: సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి శ్రీకాకుళం, విజయవాడ, బీహెచ్‌ఈఎల్ వరకు నూతనంగా సర్వీసులు నడిపిస్తున్నట్టు డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మంలో సాయంత్రం 5.30కు బయల్దేరే సూపర్ లగ్జరీ సర్వీస్ నెం.9937 బస్సు సత్తుపల్లికి రాత్రి 8గంటలకు చేరుకుని అక్కడినుంచి అశ్వారావుపేట, రాజమండ్రి మీదుగా వైజాగ్‌కు రాత్రి 3.30చేరుకోని ఉదయం 5.30కు శ్రీకాకుళం చేరుకుంటుందని చెప్పారు. ఖమ్మం నుంచి రూ.1000, సత్తుపల్లి నుంచి రూ.860గా చార్జీలు నిర్ణయించగా తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4గంటలకు బయల్దేరిన బస్సు సత్తుపల్లికి రాత్రి 2.15కు, ఖమ్మానికి 4గంటలకు చేరుతుందని చెప్పారు. విజయవాడకు ప్రస్తుతం 14 ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు నడిపిస్తుండగా వాటిని 8 (అద్దె బస్సులు)కు కుదించడంతోపాటు కొత్తగా 6 డీలక్స్ సర్వీస్‌లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ బీహెచ్‌ఈఎల్ సర్వీస్‌ను గౌరిగూడెం, సిద్దారం, సదాశివునిపేట, భీమవరం, మర్లపాడు మీదుగా రాత్రి 9.45కు, దమ్మపేట మీదుగా అశ్వారావుపేట నుంచి ఉదయం 6గంటలకు నూతన సర్వీసులను నడపనున్నట్టు తెలిపారు. అదేవిధంగా భక్తులు, ప్రయాణికుల సౌకర్యార్థం ద్వారకా తిరుమల సర్వీస్ ఆలోచనలో ఉందని తెలి పారు. కార్యక్రమంలో విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు ఉన్నారు.



పూజలు నిర్వహస్తున్న అర్చకులు

అంజన్నకు అభిషేకం

భద్రాచలం, జూన్ 11: భద్రాచల శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయ ఆవరణలో ఉన్న దాసాంజనేయస్వామికి మంగళవారాన్ని పురస్కరించుకొని అబిషేకం నిర్వహించారు. అలాగే సీతారాములకు నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

నిషేధిత గుట్కా స్వాధీనం

మణుగూరుటౌన్, జూన్ 11: మణుగూరు పట్టణంలోని పలు కిరాణా దుకాణాల్లో మంగళవారం మణుగూరు ఎస్ఐ మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు రూ.8 వేల విలువైన నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పలువురిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

బడి గంటలు మోగే వేళ

(3వ పేజీ తరువాయి)

కొనసాగనుంది. అన్ని పాఠశాలల్లో కంప్యూటర్ విద్య నేటికీ హామీగానే మిగిలి ఉంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు ఇప్పటికీ మెరుగుపడలేదు.

ఖమ్మం జిల్లాలో 1,268 ప్రభుత్వ పాఠశాలలుండగా.. అందులో 1నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు 60,387మంది ఉండగా, 4,702 ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 1,687 పాఠశాలలు ఉండగా.. సుమారు 1,69,742 మంది విద్యార్థులు ఆయా పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసి 642 పాఠశాలలను సుందరీకరణ చేపట్టింది. కానీ ఇప్పటి వరకు కేవలం 304 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. ఇంకా 338 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయి. ఇరుజిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు 60శాతం మౌలిక వసతుల లేమితో ఉన్నాయి. మిషన్ భగీరథతో ప్రతి ప్రభుత్వ పాఠశాలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం చెప్పినా.. నేటికీ కనెక్షన్లు ఇవ్వలేదు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థినులు వాటర్ తాగితే యూరిన్‌కి వెళ్లాలని నీళ్లు కూడా సరిపడా తాగట్లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. మన ఊరు - మన బడి కింద ఎంపికైన పాఠశాలల్లో కొంతమేర మౌలిక వసతులు కల్పించారు. అయితే నిధుల లేమితో నూతన భవనాలు పూర్తి కాలేదు. ఖమ్మం జిల్లాలో కేవలం నలుగురు ఎంఈవోలు పర్యవేక్షణ చేస్తున్నారు. ఖమ్మం జిల్లాల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంతో 125పాఠశాలలు మూతపడే అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలల



విషయంలో తమ బాధ్యతను విస్మరించి ప్రైవేట్ పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఏటా పెరుగుతున్న ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం ధరలను తలచుకుని తల్లిదండ్రులు భయపడుతున్నారు. నేటి నుంచి పాఠశాలలు ప్రారంభంకానుండటంతో సుదూర ప్రాంతాలకు వెళ్లిన విద్యార్థులు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు ఎప్పటిలాగే ఉంటే జూన్ వచ్చిందంటేనే సామాన్య, మధ్యతరగతి ప్రజల్లో గుండె దడ మొదలవుతుండగా నోట్‌పుస్తకాల ధరలు ఈ సారి 15 శాతం మేర పెరగడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బుక్‌స్టాల్స్‌లో ఇష్టారీతిన ధరలు పెంచి విక్రయిస్తున్నారే ఆరోపణలున్నాయి. 5వ తరగతి విద్యార్థికి నోట్ పుస్తకాల కోసమే రూ.3వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతో కునారిల్లుతుండగా తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ కోసం ప్రైవేట్ విద్యాసంస్థలను ఆశ్రయించక తప్పడం లేదు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకం విద్యార్థుల తల్లిదండ్రుల్లో లేకపోవడంతో వారంతా ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చేరుస్తున్నారు. వాస్తవంగా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన, నాణ్యమైన ఉపాధ్యాయులున్నా.. పిల్లలకు తగిన సంఖ్యలో గురువులు ఉండటం లేదు. ఉన్న కొద్దిమందిని ఇతర అవసరాలకు ప్రభుత్వం వినియోగిస్తుండటంతో వీరిపై తల్లిదండ్రుల్లో నమ్మకం సన్నగిల్లింది. దీంతో పాటు ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్య అందని ద్రాక్షగా మారింది. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల పంపిణీ గత విద్యా సంవత్సరం చివర్లోనే మొదలైంది. అయితే ఈసారి ప్రభుత్వం విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులు విద్యా సంవత్సరం ప్రారంభం రోజు అందే అవకాశాలు కనిపించడం లేదు.

జిల్లాలోని అన్ని మండలాలకు ఇటీవలే ఏకరూప దుస్తులు కుట్టించేందుకు ప్రభుత్వం వస్త్రాలను సరఫరా చేసింది. కానీ దర్జీలు సకాలంలో అందించే అవకాశాలు కనిపించడం లేదు. ఆయా మండలాల్లో కొన్ని ఏజెన్సీలకే దుస్తులు కుట్టే బాధ్యతలు అప్పగించినా.. అనుకున్న మేర పని ముందుకు కదలడం లేదు. జూన్ మాసం చివరికల్లా ఆయా మండలాల పరిధిలో 50శాతం మంది విద్యార్థులకు కూడా ఏకరూప దుస్తులు పంపిణీ చేసే అవకాశాలు లేవని మండల విద్యాశాఖాధికారులే చెబుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది. దీంతో పాఠశాల ప్రారంభం రోజున విద్యార్థులు యూనిఫాంలో కనిపించే పరిస్థితి లేదు.

ప్రభుత్వ పాఠశాలల్లో

ప్రవేశాలు పెంచాలి

- ఇంగ్లీష్ మీడియం బోధనపై అవగాహన కల్పించాలి
- కనీస వసతులకు లోటు రాకుండా చూడాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 11: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పెద్దఎత్తున విద్యార్థులను చేర్పించాలని, బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం బడిబాట, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పూర్తిపై విద్యాశాఖ, ఇంజనీరింగ్, మండల సమాఖ్యలతో ఆయన సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామగ్రామాన బడిబాట కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాల న్నారు. ప్రతి ఇంటికి వెళ్లి బడీడు పిల్లలను గుర్తించి వారి వివరాలు సేకరించాలన్నారు. గుర్తించిన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పన, ఇంగ్లీష్ మీడియం బోధనపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకొని అప్‌గ్రేడ్ అవుతున్న ఐదు నుంచి ఆరు సంవత్సరాల వయసున్న చిన్నారులందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ, విద్యాబోధనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తద్వారా ప్రభుత్వ పాఠశాలలకు గుర్తింపు తీసుకురావాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, టాయిలెట్స్ మిగిలిన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వారంలోగా పనులన్ని పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళా సంఘాలే పను లు చేపట్టాలని, నిధుల మంజూరు విషయంలో ఎలాంటి జాప్యం చేయొద్దన్నారు. ఈ నెల 12వ తేదీ వరకు పాఠ్యపుస్తకాలు అందించడంతోపాటు యూనిఫామ్స్ విద్యాశాఖ అధికారులు సిద్ధంచేసి ఉంచాలని సూచించారు. పాఠశాలల్లో శానిటేషన్ సంబంధించిన పనులు చేపట్టాలని తెలిపారు.

పాఠశాలల పునఃప్రారంభం రోజున పాఠశాలలను అరటి, మామిడి ఆకులతో అలంకరణ చేయాలని, పండుగ వాతావరణం స్ఫురించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల ప్రవేశం, ఆవరణలో వీధిదీపాల ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, జడ్పీ సీఈవో ఎస్.వినోద్, డీఆర్డీవో ఆర్.సన్యాసయ్య, డీఐఈవో రవిబాబు, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ విజయలక్ష్మి, పంచాయతీ రాజ్, మునిసిపల్, ఆర్‌అండ్‌బీ ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం రైతునేస్తం ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం, జూన్11: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్‌లో రైతులకు సాగులో మెలకువలు, నూతన వంగడాల వివరాలు, అధిక దిగుబడులు సాగించే పద్ధతులు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు వానాకాలం రైతు నేస్తం కార్యక్రమాలు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రతి మంగళవారం ఒక రైతువేదికలో వీడియోకాన్ఫరెన్సు ద్వారా రైతులకు సాగులో మెళుకువలను శాస్త్రవేత్తలు వివరించనున్నారు. రఘునాధపాలెం రైతువేదికలో వ్యవసాయశాఖ, వ్యవసాయ వర్శిటీతో కలిసి భూసార వివరాలు, సాగు పద్ధతులు, ఎరువులు యాజమాన్యం, నూతన వంగడాలు తదితర అంశాలపై శాస్త్రవేత్తలు , ఆదర్శరైతులు రైతువేదికలోని రైతులకు వివరించారు. అధిక సాంద్రత పత్తిసాగు వివరాలు, విత్తన ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో డీహెచ్ఎస్‌వో రమణ, ఏడీఏ(పీపీ) సరిత, ఏడీఏ శ్రీనివాసరావు, రైతుసమన్వయసమితి జిల్లా కో ఆర్డినేటర్ నల్లమల వెంకటేశ్వరరావు తో పాటు ఖమ్మంఅర్బన్, రఘునాధపాలెం, కామేపల్లి మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు , రైతులు పాల్గొన్నారు.



రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

హైకోర్టు న్యాయవాది శామీర్

మృతికి బార్ సంతాపం



శామీర్

ఖమ్మం లీగల్ జూన్ 11: ఖమ్మం నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది ఎస్‌కె.ఖాదర్‌బాబా చిన్న కుమారుడు ఎస్‌కె.శామీర్(30) హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో మృతి చెందాడు. ఆయన మృతికి ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ళ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చింతన్పిప్పు వెంకట్ బార్ కార్యవర్గం, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు కె.రాజశేఖరరెడ్డి, జూనియర్ న్యాయవాదులు సంతాపాన్ని తెలియజేశారు.

పాము కాటుతో విద్యార్థిని మృతి

మంగపేట, జూన్ 11: పాము కాటుకు గురై విద్యార్థిని మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పర్ణశాల శివారు బండిరేవుకు చెందిన లెంకల స్వరూప, సమ్మయ్య కుమార్తె రాణి (14) ఎనిమిదో తరగతి చదువుతోంది. వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి పది రోజుల క్రితం మంగపేట మండలంలోని కమలాపురం వచ్చింది. అనంతరం పెద్దనాన్న రామకృష్ణ ఇంటికి దేవనగరం వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మంచంపై కూర్చొని కాళ్లు కింద పెట్టి మాట్లాడుతుండగా పాము కాటేసింది. ఈ విషయాన్ని బాలిక ఆ ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. అందరితో కలిసి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయింది. దీంతో చికిత్స నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగానే బాలిక మృతి చెందింది.

తవ్వారు...వదిలేశారు..

- సుందరీకరణ పేరుతో తవ్వకాలు
- ప్రమాదంలో వేశ్యకాంతల చెరువు కట్ట
- పట్టించుకోని అధికారులు

సత్తుపల్లి, జూన్ 11:సత్తుపల్లిలోని వేశ్యకాంతల చెరువు సుందరీకరణ పేరుతో చేపట్టిన పనులు అస్తవ్యస్థంగా తయారయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా చెరువు కట్ట ప్రమాదంలో పడింది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ పనులు కాంట్రాక్టర్ కొంత మేర చేసి వదిలేయడంతో చెరువు సుందరీకరణ సంగతి ఎలా ఉన్నా కట్ట ప్రస్తుత అధ్వాన్నంగా తయారై ప్రమాదంలో పడింది. చెరువు సందరీకరణకు అంచనాలు రూపొందించి టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించిన పబ్లిక్ హెల్త్ అధికారులు కనీసం జలవనరుల శాఖ నుంచి కనీసం ఎన్ఓసీ కూడా తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని చెప్పకనే చెపుతోంది.

రూ.5కోట్లతో అంచనాలు....

వేశ్యకాంతల చెరువు సుందరీకరణ చేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు గత ప్రభుత్వం పతిపాదించింది. ఈ మేరకు టీఎఫ్ఐడీసీ నుంచి రూ.3కోట్లు, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్) రూ.2రెండు కోట్లు కేటాయించారు. టీఎఫ్ఐడీసీ నిధులకు సంబంధించి టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. తొమ్మిది నెలల క్రితం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ చెరువు కట్టను తవ్వి వదిలేశారు.

జలవనరుల శాఖ ఎన్‌వోసీ లేకుండానే..

చెరువు అభివృద్ధి పనులు చేయాలంటే ఏ శాఖ పనులు చేయిస్తుందో ఆ శాఖ నీటి పారుదల శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకొని ముందుకు సాగాల్సి ఉంది. కాని ఇక్కడ ఎలాంటి ఎన్‌వోసీ లేకుండా పనులు మొదలు పెట్టి వదిలేశారు. సాధారణంగా చెరువు సుందరీకరణ సమయంలో నీటి పారుదల శాఖ నిబంధనలు పాటించాల్సి ఉంది. చెరువు కట్ట పొడవులో 600 మీటర్ల పొడవునా తవ్వేశారు. ప్రస్తుతం ఉన్న చెరువు కట్ట ఎత్తును సుమారు 600 మీటర్ల పొడవునా మీటరు వరకూ తవ్వారు. ప్రతి చెరువు కట్ట టాప్ అఫ్ బండ్ లెవల్ (టీబీఎల్) మూడున్నర మీటర్లు కనీసం ఉండాల్సి ఉంది. చెరువు కట్ట తవ్విన తరువాత వెడల్పు అస్తవ్యస్తంగా తయారైంది. చెరువు కట్ట వెడల్పు ఎనిమిది మీటర్లకు పెంచి సెంట్రల్ లైటింగ్ ఏర్పాట్లు చేస్తారని పనులు శంకుస్థాపన సమయంలో ప్రకటించారు. కాని ఇప్పటి వరకూ పనులు ముందుకు సాగకపోగా కట్ట తవ్వటంతో ప్రమాదంలో పడింది. నీటిపారుదల శాఖ నిబంధనల ప్రకారం స్లోప్స్ చేయాలి కాని పనులు వదిలేయటంతో ఇక్కడ అవేమీ కనిపించటం లేదు.

మునిసిపల్ ఏఈ సురేష్‌ను సంప్రదించగా దీనికి సంబంధించి వివరాలన్నీ ఈఈ కార్యాలయంలో ఉంటాయని చెప్పారు. పబ్లిక్ హెల్త్ ఏఈ అనితను సంప్రదించగా తమ వద్ద సమాచారం లేదని, డీఈఈ వద్ద ఉంటాయని చెప్పారు. క్షేత్ర స్థాయి అధికారుల వద్ద కనీసం సమాచారం లేకుండా పనులు ఎలా చేసారనేది ప్రశ్నార్థకంగా మారింది. అంటే స్థానిక మునిసిపాలిటీలో కూడా సమాచారం లేని పరిస్థితి ఇక్కడ ఉండటం కొసమెరుపు.



ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేసిన చెరువు కట్ట

ఎన్‌వోసీ తీసుకోలేదు: డీఈఈ

జలవనరుల శాఖ నుంచి వేశ్యకాంత చెరువు సుందరీకరణ పనులకు సంబంధించి ఎటువంటి ఎన్‌వోసీ తీసుకోలేదని ఆ శాఖ సత్తుపల్లి డీఈఈ వెంకటేశ్వర్లు చెప్పారు. నిబంధనల ప్రకారం తమ శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉందని అన్నారు.

మహిళా సంఘాలకు కలిసి రాని..

మామిడి వ్యాపారం

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారుల కార్యాచరణ లోపం
- రైతుల నుంచి ఎంవోయూలో జాప్యం
- గతేడాది 100టన్నుల అమ్మకాలు.. ఈ సంవత్సరం 39.4 టన్నులే



ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 11: మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆర్థిక పరిపుష్టి కోసం చేపట్టే కార్యక్రమాలు ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ప్రాముఖ్యతను చాటుకొంది. 2018 నుంచి ఖమ్మంతో పాటు మంచిర్యాల, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మామిడి కొనుగోలు వ్యాపారం పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. ఖమ్మం జిల్లాలో నాణ్యమైన మామిడికాయలు దిగుబడి రావడం, తక్కువ ధరలకు రైతుల నుంచి ఒప్పందాలు చేసుకొని ఎగుమతి చేయటంతో మామిడి వ్యాపారం జోరుగా సాగింది. 2018 నుంచి మామిడి దిగుబడిని అనుసరించి ప్రతి సంవత్సరం 100 టన్నుల నుంచి 160 టన్నుల వరకు మహిళా స్వయం సహాయక సంఘాలతో ఏర్పాటు చేసిన ఎఫ్‌పీసీ (ఫార్మర్ ప్రొక్యూర్‌మెంట్ కంపెనీలు)ల ద్వారా అమ్మకాలు జరిగాయి. లాభాలు బాగా రావడంతో మధిర, కొణిజర్ల, ఖమ్మం, సత్తుపల్లి, వేంసూరులో పోటా పోటీగా ఎఫ్‌పీసీలు ఏర్పాడ్డాయి.

ఎంవోయూలో జాప్యం......

జిల్లాలో ఆరేళ్లుగా మహిళా స్వయం సహాయక సంఘాలు మామిడి వ్యాపారంలో రాణించటంతో మామిడి రైతులకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు మంచి సంబంధాలు ఉన్నాయి. కానీ 2024 ఏడాదికి గాను మామిడి కొనుగోలు వ్యాపారానికి ప్రారంభం నుంచి సరైన కార్యాచరణ జరగలేదని తెలుస్తోంది. మామిడి రైతులకు ఫార్మర్ ప్రొక్యూర్‌మెంట్ కంపెనీలకు మధ్య సమన్వయం చేయడంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు కార్యాచరణ చేయలేదని, కింది స్థాయిలోని ఉద్యోగులకు ఒప్పంద బాధ్యతలను కేటాయించారనే విమర్శలున్నాయి. ఈ సారి మామిడి దిగుబడి తక్కువగా రావటంతో రైతులతో ముందస్తు ఒప్పందాలు చేసుకోవటంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు వెనుకబడ్డారు. దీంతో హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి మామిడి వ్యాపారులు వచ్చి రైతుల నుంచి మామిడి కాయలు కొనుగోలు చేశారు.

39.4 టన్నులే......

జిల్లాలో ప్రతి ఏడాది 100 టన్నులకు పైగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా మామిడి వ్యాపారం జరుగుతుండగా, ఈ సంవత్సరం మార్చి 20న మామిడి వ్యాపారం ప్రారంభించారు. వేంసూర్‌కు చెందిన గుబ్బల మంగమ్మ, ఖమ్మానికి చెందిన సిరివెన్నెల ఫార్మర్ ప్రొక్యూర్‌మెంట్ కంపెనీలచే 20రోజుల పాటు మామిడి వ్యాపారం జరిగింది. కేవలం 39.4 టన్నులకే పరిమితమైంది. మామిడి రైతుల నుంచి కేజీ మామిడి కాయలు రూ..40కు కొనుగోలు చేసి ఎఫ్‌పీసీ ద్వారా కేజీ రూ.60కు అమ్మకాలు చేశారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ మామిడి కాయలు రూ.100 నుంచి రూ.120 వరకు ధర పలికాయి. మార్కెట్ ధరలో సగం ధరకు అమ్మకాలు జరపకపోవడంపై విమర్శలు వెలువడుతున్నాయి. ప్రతీ సంవత్సరం డీఆర్‌డీఏ, ఖమ్మం పెవిలియన్ మైదానం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, ప్రదాన కూడళ్లలో మామిడి కాయల స్టాల్స్ ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపారు. కానీ ఈ సంవత్సరం కనీసం సమీకృత కలెక్టరేట్‌లో కూడా మామిడి వ్యాపారం జరగలేదు. దీంతో బెంగుళూర్ కంపెనీకి 25 టన్నులు, హైదరాబాద్ కంపెనీలకు 12 టన్నులను అమ్మకాలు జరిపారు. వీరికి ఎగుమతి చేసిన వాటిలో నాణ్యత లేదని తిరిగి పంపిన మామిడి కాయలను తిరిగి ఖమ్మంలో గుట్టు చప్పుడు కాకుండా 24 క్వింటాళ్లు అమ్మకాలు జరిపారని విమర్శలు వెలువడుతున్నాయి. మొత్తంగా 39.4 టన్నుల మామిడి వ్యాపారం జరిగినట్లు అధికారులు లెక్కల్లో తెల్చారు.

దిగుబడి రాక తక్కువ అమ్మకాలు

● శ్రీనివాసరావు, డీపీఎం

ఈ సంవత్సరం మామిడి దిగుబడి తగ్గడంతో వ్యాపారం జరగలేదు. 20రోజులు పాటు అమ్మకాలు జరిగాయి. ఎఫ్‌పీసీల ద్వారా మొత్తం 39.4 టన్నుల వ్యాపారం జరిగింది. వీటిలో బెంగుళూర్, హైదరాబాద్ కంపెనీలకు అమ్మకాలు జరిగాయి. వాటి నుంచి ఇప్పటి వరకు 70శాతం పేమెంట్స్ జరిగాయి. ఇంకా 30శాతం రావాల్సి ఉంది. దిగుబడి తక్కువగా ఉండటంతో స్థానికంగా స్టాల్స్ పెట్టి అమ్మకాలు జరపలేక పోయాం.

రామోజీరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 11: ఈనాడు సంస్థల యాజమాని, దివంగత చెరుకూరి రామోజీరావు కుటుంబ సభ్యుల్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని రామోజీరావు నివాసానికి వెళ్లిన మంత్రి తుమ్మల రామోజీరావు కుమారుడు, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారిని ఓదార్చారు. అనంతరం రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- కలెక్టర్ వీపీ. గౌతమ్

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్11: ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన విద్యా బోధనతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. మంగళవారం నగరంలోని రమణ గుట్టలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ ఇంటింటికీ తిరుగుతూ, ఇంట్లో చదువుకొనే పిల్లలు ఉన్నది, ఏ పాఠశాలలో చదువుతున్నది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని వారి పిల్లలను తప్పనిసరిగా చదివించాలని తెలిపారు. ప్రతి ఒక్క పిల్లవాడు పాఠశాలలో నమోదయ్యే దిశగా బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం జూన్ 6 నుంచి జూన్ 19 వరకు నిర్వహిస్తుందని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతులు, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో వస్తున్న మెరుగైన ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. బట్టీపట్టే విధానం కాకుండా పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమయ్యే దిశగా వారికి వివరిస్తూ కొత్త బోధనా పద్ధతులను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నామని అన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

అంతకుముందు కలెక్టర్ స్థానిక ఎస్‌ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తనిఖీ చేశారు. అద్దె భవనంలో పాఠశాల నిర్వహిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ సందర్శించి సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో సోమశేఖరశర్మ, ఖమ్మం అర్బన్ ఎంఈవో శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు శంకర్‌రావు, పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యే లక్ష్యంగా ముందుకు ..

- ఐటీడీఏ పరిధిలోని విద్యా సంస్థలపై పీవో ప్రత్యేక నజర్
- నిర్వహణ ఖర్చులకు ఒక్కో గురుకులానికి రూ.40 వేలు

భద్రాచలం, జూన్ 11 : నూతన విద్యా సంవత్సరం ఆరంభమవుతున్న సమయంలో ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యా సంస్థల్లో గుణాత్మక విద్యే లక్ష్యంగా ముందుకు వెళ్లడంపై ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ దృష్టి సారించారు. ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి దానిని అమలు చేసే దిశగా ఐటీడీఏ పరిధిలోని విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సమస్యలు, వసతుల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి ఒక్కొక్క గురుకులానికి రూ.40 వేలునిధులను సైతం విడుదల చేశారు. వీటితో గురుకులాల్లోని సమస్యలకు పరిష్కరించుకోవాలని ఆదేశించారు.

గుణాత్మక విద్యే లక్ష్యంగా ముందుకు ప్రస్తుత ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఐటీడీఏ విద్యా విభాగంపై ప్రత్యేక దృష్టిసారించారు. విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం , సమయపాలనపై దృష్టి సారించిన ఆయన నూతన విద్యా సంవత్సరంలో పూర్తిగా గుణాత్మక విద్యే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అదేవిధంగా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ ను సైతం అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రాథమిక విద్య స్థాయిలో ఎస్‌జీటీలకు ఆంగ్లం, లెక్కలు, సామాన్య శాస్త్రాల్లో శిక్షణకు సైతం కసరత్తు చేపట్టారు. ఇందులో భాగంగా విద్యా గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా ఆశ్రమాల్లో మౌళిక సమస్యల పరిష్కారానికి మే నెలలోనే ఆయన చర్యలు చేపట్టారు. ఐటీడీఏ పరిధిలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50 ఆశ్రమ పాఠశాలలు, 13 వసతి గృహాలు, ఖమ్మం జిల్లా పరిధిలోని పది ఆశ్రమ పాఠశాలలు, ఎనిమిది వసతి గృహాల్లో ఉన్న సమస్యలను గుర్తించేందుకు 24 మంది ప్రత్యేక అధికారులకు 59 విద్యా సంస్థల దత్తత బాధ్యతను అప్పగించారు. ఇదే సమయంలో స్వయంగా తాను సైతం క్షేత్రస్థాయిలో పాఠశాలలను తనిఖీ చేసి గతంలో బంకర్ల బెడ్ల స్థానంలో సింగిల్‌కాట్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే క్షేత్రస్థాయిలో అన్ని పాఠశాలల్లో సింగిల్ కాట్లను ఏర్పాటు చేయడం జరిగిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే విద్యా సంస్థలకు 3,552 ఫ్యాన్లు, 4,530 ట్యూబ్‌లైట్లు కొనుగోలు చేసి వాటిని అవసరమైన చోట ఏర్పాటు చేశారు.



భద్రాచలం బాలికల పాఠశాలను తనిఖీ చేస్తున్న పీవో ప్రతీక్‌జైన్

కేంద్ర మంత్రులను కలిసిన తాండ్ర వినోదరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, జూన్11: కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన పలువురు మంత్రులను బీజేపీ నాయకుడు తాండ్ర వినోదరావు ఢిల్లీలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, జ్యోతిరాధిత్యసింధియా, గజేంద్రసింగ్ షెకావత్‌లను కలిసి వారికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



బండి సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న తాండ్ర

'బెస్ట్ అవైలబుల్'కు అనూహ్య స్పందన

- 1వ, 5వ తరగతిలో ప్రవేశాలకు లాటరీ విధానం
- 706 మంది విద్యార్థుల హాజరు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 11: సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వమే ఫీజులు చెల్లించి కార్పొరేట్ పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు రూపొందించిన బెస్ట్ అవైలబుల్ విద్యా ప్రవేశాలకు అనూహ్య స్పందన వచ్చింది. మంగళవారం ఖమ్మం డీపీఆర్సీ భవనంలో లాటరీ విధానం ద్వారా విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి విద్యార్థులతో పాటుగా తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరుకావడంతో డీపీఆర్సీ భవనం కిక్కిరిసిపోయింది. 1వ తరగతిలో 128 సీట్లకు గాను 309 మంది, అలాగే 5వ తరగతిలో 131 సీట్ల ప్రవేశాలకు 397 మంది విద్యార్థులు దరఖాస్తులు చేశారు. డీడీ కస్తాల సత్యనారాయణ, విద్యాశాఖ, గురుకులాల పర్యవేక్షకులు జ్యోతి, భూలక్ష్మి సమక్షంలో లాటరీల ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. కాగా ప్రశాంతంగా పారదర్శకంగా లాటరీ విధానం పూర్తి చేశామని డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ ప్రకటించారు. పర్యవేక్షకులు ఆర్‌వీఆర్ ప్రసాద్, హన్మంతరావు, శంకర్, అస్లామ్ ఖాన్, పాతిమా, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమక్షంలో లాటరీ తీస్తున్న చిన్నారి

రేపు భద్రాద్రిలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాల ప్రవేశాలకు లాటరీ

చుంచుపల్లి, జూన్11: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాలకు గాను గురువారం లాటరీ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి దాసరి అనసూర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలను సారం నిర్వహిస్తున్నట్లు ఈ ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. కావున సంరక్షకులు, తల్లిదండ్రులు సకాలంలో ఐడీవోసీలోని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయానికి రావాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ బిల్లులలో పెరిగిన...

ఆన్‌లైన్ చెల్లింపులు

- 71,865 మంది వినియోగదారులు
- గత నెలలో రూ.13.97 కోట్ల చెల్లింపులు
- త్వరలో బిల్లుపై క్యూఆర్‌కోడ్ ముద్రణ

భద్రాచలం, జూన్11: విద్యుత్ బిల్లుల చెల్లింపును ఆన్‌లైన్ ద్వారా అత్యధిక శాతం మంది చేస్తున్నారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ భద్రాద్రి కొత్తగూడెం సరిల్ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు రోజురోజుకూ పెరుగుతోంది. ఇటీవల కాలంలో ఆండ్రాయిడ్ ఫోన్‌లు అత్యధిక శాతం మంది వినియోగిస్తుండటంతో అందులో అందుబాటులో ఉన్న వివిధ మొబైల్ యాప్ల ద్వారా వినియోగదారులు చెల్లింపులకు ఆసక్తి కనబరుస్తున్నారు. మే నెలలో 71,865 మంది గృహ వినియోగదారులు రూ 13.97 కోట్ల మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. ఇటీవల కాలంలో ప్రతి నెల ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు పెరుగుతున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. టీజీఎన్‌పీడీసీఎల్ మొబైల్‌యాప్, వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.టీజీఎన్‌పీడీసీఎల్.కామ్, గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం ద్వారా నెలవారీ విద్యుత్ బిల్లులను వినియోగదారులు చెల్లిస్తున్నారు. దీని వలన గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడే బాధ తప్పడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. ఇంటి నుంచే 24 గంటలూ విద్యుత్ బిల్లులు చెల్లించేలా వెసులుబాటు ఉంటుంది. ఇందుకు మీ యుఎస్‌సీ నెంబరును నమోదు చేసుకుని బిల్లులు చెల్లించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ విధంగా చెల్లింపులు చేయడం వలన రశీదులు పొందవచ్చన్నారు. తాజాగా కొత్తగా బిల్లుపైన క్యూఆర్‌కోడ్‌ను ముద్రించే విధానాన్ని వరంగల్ సర్కిల్ కేంద్రంలోని మట్టెవాడ ఈఆర్‌వో పరిధిలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. త్వరలో భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధిలో కూడా ఈ విధానం వినియోగదారులకు అందుబాటులోకి రానుంది. క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా మీ విద్యుత్ బిల్లుకు సంబంధించిన వివరాలు చెల్లించాల్సిన మొత్తం తెలుసుకోవచ్చు.



ఆన్‌లైన్ చెల్లింపుతో సమయం ఆదా..

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ భీకం సింగ్

ఆన్‌లైన్ విద్యుత్ బకాయిల చెల్లింపుతో సమయం ఆదా అవుతుంది. 24 గంటలూ విద్యుత్ బిల్లులు చెల్లించేలా వెసులుబాటు ఉంటుంది. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడే బాధ తప్పుతుంది. కొత్తగా బిల్లుపైన క్యూఆర్‌కోడ్‌ను ముద్రించే విధానం త్వరలో అందుబాటులోకి రానుంది. వినియోగదారులకు సెల్ఫ్ రీడింగ్ (వారి బిల్లులను వారే ఫోన్‌లో తీసుకునే విధంగా) అవగాహన కల్పిస్తున్నాం. నూరు శాతం సెల్ఫ్ రీడింగ్ వినియోగదారులే తీసుకుంటూ నూరు శాతం చెల్లిస్తున్నారు. భవిష్యత్‌లో మొత్తం డిజిటల్ రూపంలోనే కార్యకలాపాలు సాగుతాయని, వినియోగదారులు బిల్లులను ఆన్‌లైన్ ద్వారానే చెల్లించి సమయాన్ని ఆదా చేసుకోవాలి.

శతాధిక వృద్ధురాలి మృతి



అనసూర్యమ్మ

జూలూరుపాడు, జూన్ 11: జూలూరుపాడు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు యల్లంకి అనసూర్యమ్మ (105) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఆమెకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతదేహన్ని కాంగ్రెస్ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారయణ, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, బీజేపి నాయకులు చిలుకూరి రమేష్, నున్న సతీష్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పిజి. కృష్ణమూర్తి, సాయిల నాగేశ్వరరావు, నున్నరంగారావు, సాయిల కృష్ణయ్య, మోదుగు రామకృష్ణ సందర్శించి నివాళులర్పించారు.

13న అశ్వాపురం మండలంలో మంత్రుల పర్యటన

అశ్వాపురం, జూన్ 11: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన రెవెన్యూ, వ్యవసాయ శాఖా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా మండలంలో ఈనెల 13న పర్యటించనున్నారు. ఈమేరకు డిప్యూటీ సీఎం ప్రైవేట్ సెక్రటరీ భాస్కర శర్మ ప్రోగ్రాం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నిర్మిస్తున్న సీతమ్మసాగర్ బ్యారేజి, సీతారామాప్రాజెక్ట్ నిర్మాణాల ను పరిశీలించనున్నారు. అదేవిధంగా బీజీ కొత్తూరు వద్ద నిర్మించిన సీతారామా ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ను సందర్శించనున్నారు. గోదావరి నది నుంచి పంప్‌హౌస్ వరకూ నిర్మించిన గ్రావీటీ కెనాల్‌ను కూడా మంత్రుల బృందం పరిశీలించనుంది. ప్రాజెక్ట్‌ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో చర్చించిన అనంతరం పాల్వంచ మండలంలో పర్యటించనున్నారు.

వాహనాల పట్టివేత



పట్టుబడిన వాహనాలతో అధికారులు

బూర్గంపాడు, జూన్ 11: బూర్గంపాడు మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం బీట్ పరిధిలో మంగళవారం అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. అశ్వాపురం ఎఫ్ఆర్‌వో రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన దాడుల్లో అటవీ ప్రాంతంలో భూమిని చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని సందెళ్లపాడు నర్సరీకి తరలించి విచారణ చేపట్టారు. ఈ దాడుల్లో డీఆర్వో సుజాత, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

బాలికపై పిచ్చికుక్క దాడి

ఆళ్లపల్లి, జూన్ 11: పిచ్చికుక్క దాడిలో 11 ఏళ్ల బాలికకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చింతోళ్లగుంపు గ్రామంలో చోటు చేసుకుంది. చింతోళ్లగుంపు గ్రామానికి చెందిన తోలం మనోజ్ఞ అనే బాలిక తన తల్లిదండ్రులతో కలిసి మధ్యాహ్నం ఇంట్లో నిద్రపోతున్న సమయంలో, పిచికుక్క ఇంట్లోకి వచ్చి బాలికపై దాడి చేసింది. తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడిన బాలికను హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కొత్తగూడెం తీసుకెళ్లారు.

వస్త్ర దుకాణంలో చోరీ

అశ్వారావుపేట రూరల్, జూన్ 11: అశ్వారావుపేటలో భద్రాచలం రోడ్‌లో ప్రధాన రహదారిపై ఉన్న ట్రెండ్స్ వస్త్ర దుకాణంలో చోరీ జరిగింది. దుకాణ మేనేజర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం ముందు భాగంలో ఉన్న సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, షట్టర్ తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. లోపల ఉన్న సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేసి రూ.38,500 నగదుతో పాటు హార్డ్ డిస్క్‌ను చోరీ చేశారు. ఘటనలో మొత్తం దాదాపు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లుగా సమాచారం. ఎస్ఐ శ్రీరాముల శ్రీను కొత్తగూడెం నుంచి క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు.

గంజాయి రవాణా ముఠా రిమాండ్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 11: అక్రమంగా గంజాయి అమ్మకాలు చేస్తున్న ముఠాను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఖమ్మం రెండో పట్టణ ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కామేపల్లి మండలం మర్రిగూడేనికి చెందిన శ్రీనివాస్, రాయల ఉదయ్ ఖమ్మంలోని మరికొందరితో ముఠాగా ఏర్పాడ్డారు. భద్రాచలం సమీప ప్రాంతాల నుంచి ఖమ్మానికి గంజాయి తరలించి గుట్టుగా అమ్మకాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పక్కా సమాచారంతో నగరంలో తనిఖీలు చేపట్టిన అధికారులు రాయల ఉదయ్ నుంచి 300 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని, నిందితుడిని రిమాండ్ చేశారు. తనిఖీల్లో ఎస్ఐ సరిత, సిబ్బంది వీరభద్రం, సురేందర్, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, భద్రమ్మ, చెన్నమ్మ, మౌలంకర్, గురుప్రసాద్ పాల్గొన్నారు.



పట్టుబడిన నిందితులతో పోలీసులు

ఆస్తి వివాదంలో అక్కను హతమార్చిన తమ్ముడు

- ఫోరెన్సిక్ రిపోర్టుతో మూడేళ్లకు బయటపడ్డ నిజం

పెనుబల్లి, జూన్ 11: ఆస్తి వివాదంలో అనారోగ్యంతో ఉన్న అక్కకు కూల్‌డ్రింక్‌లో విషం కలిపి హతమార్చిన తమ్ముడిని అరెస్టు చేసినట్లు ఖమ్మం జిల్లా సత్తుపల్లి రూరల్ సీఐ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. వీఎంబంజర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెనుబల్లి మండలంలోని రామచందర్‌రావుబంజర్ గ్రామంలో 2021లో దూదిపాళ్ల కనకమ్మ(70)అనారోగ్యంగా ఉండటంతో ఆమె ఆస్తిని కాజేసేందుకు ఆమె సోదరుడు కోమటి వెంకటేశ్వరరావు కూల్‌డ్రింక్‌లో అక్కకు విషం తాగించి హత్యకు పాల్పడ్డాడు.

అనారోగ్యంతో తన అక్క మృతిచెందినట్లు బంధువులు, గ్రామస్థులను నమ్మించాడు. ఆమె మరో సోదరుడు కోమటి నాగేశ్వరరావు తన అక్క మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం కనకమ్మ మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి ఎఫ్ఎస్ఎల్(ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీ) రిపోర్టుకు పంపించారు. ఇటీవల వచ్చిన ఆ రిపోర్టులో విషం కారణంగానే కనకమ్మ మృతిచెందినట్లు వెల్లడికావడంతో అనుమానాస్పద మృతి కేసును హత్యకేసుగా నమోదు చేసి నిందితుడు వెంకటేశ్వర్లును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చర్లలో లారీ టేకు కలప పట్టివేత

- ఖమ్మం తరలిస్తుండగా స్వాధీనం
- లారీ డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు

చర్ల, జూన్ 11: లారీ నిండా టేకు కలపను నింపుకొని ఖమ్మం తరలిస్తుండగా చర్ల అటవీశాఖ అధికారులు మాటు వేసి పట్టుకున్నారు. చర్ల మండలం లెలిన్ కాలనీ వద్ద మంగళవారం తెల్లవారుజామున పట్టుబడ్డ ఈ కలప విలువ సుమారు రూ.6లక్షల 50,805 వేలు ఉంటుందని అటవీశాఖ అధికారులు అంచనావేస్తున్నారు. చర్ల మండలంలోని వద్దిపేట గ్రామం నుంచి ఓ లారీలో టేకు కలపను లోడ్ చేసుకుని చర్ల మీదుగా ఖమ్మం వెళతండగా సోమవారం రాత్రి చర్ల అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో చర్ల రేంజ్ అధికారి ఉపేందర్ ఆదేశాల మేరకు వద్దిపేట సెక్షన్ ఆఫీసర్ సంతోష్ ఇతర సిబ్బంది చర్ల మండలం లెలిన్ కాలనీ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. అనంతరం లారీని చర్ల అటవీశాఖ కార్యాలయానికి, అక్కడి నుంచి భద్రాచలం ఎఫ్‌డీవో కార్యాలయానికి తరలించారు. పట్టుబడ్డ లారీలో 264 టేకు చెక్కలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం వాటికి పంచనామా నిర్వహించారు. వాటి విలువ రూ.6లక్షల 50వేల808 ఉందని రేజ్ అధికారి ఉపేందర్ తెలిపారు. ప్రస్తుతం టేకు కలప ఎక్కడి నుంచి తీసుకొచ్చారని విచారణ చేస్తున్నామని, లారీ డ్రైవర్ వెంకటేశ్వర్లు, ఓనర్ రమేష్‌పై కేసులు నమోదు చేశామని తెలిపారు. కాగా ఇంత విలువైన కలుప ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై విచారణ చేస్తున్నామన్నారు. పట్టుబడ్డ కలప సైజులను పరిశీలిస్తే ఇది ఇంటి నిర్మాణానికి తీసుకుని వెళ్తున్నట్లు తెలుస్తోంది. అలాగే కొద్ది రోజుల క్రితం ఇదే వద్దిపేట నుంచి ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న టేకు చెక్కలను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు.



పట్టుబడిన టేకు కలప

ఆయిల్‌పామ్ సాగుదారుల సదస్సును జయప్రదం చేయండి

అశ్వారావుపేట, జూన్ 11: అశ్వారావుపేటలో ఈనెల 15వ తేదీన ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పామ్ సాగుదారుల సదస్సును జయప్రదం చేయాలని ఏఐకెఎస్ రాష్ట్ర నాయకుడు అన్నవరపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు ఏఐకెఎస్ కేంద్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శనరావు పాల్గొంటారని తెలిపారు. స మావేశంలో సంఘ రాష్ట్ర నాయకులు పుల్లయ్య కొండబోయి న వెంకటేశ్వరరావు, దొడ్డ లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీని వాసరావు, తగరం జగన్నాథం, కలపాల భద్రం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఎరువులు ఉచితంగా ఇవ్వాలి

సత్తుపల్లిరూరల్, జూన్11: ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, మినీ ట్రాక్టర్లతో పాటు ఇతర వ్యవసాయ పరికరాలను ఎస్సీఎస్టీ,చిన్న,సన్నకారు రైతులకు ఉచితంగా ఇవ్వాలని అఖిల భారత ప్రగతి శీల రైతుసంఘం ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం సత్తుపల్లిలో ప్రదర్శన నిర్వహించారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. రూ.2లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని, స్వామినాథన్ సిఫారసును తక్షణమే అమలు చేయాలని, బ్యాంక్ అప్పులు తీసుకున్న రైతులకు మాత్రమే పంట బీమా పథకాన్ని వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వ ఫసల్ బీమా అందరికీ అని చెప్పి కొందరికి మాత్రమే వర్తింపజేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం వడగండ్లతో నష్టపోయిన రైతులకు రూ.10వేల నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, కందిమళ్ల ప్రసాద్, ముత్యాలు, కామేష్, ఆదినారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా పచ్చిరొట్ట విత్తనాలు

ప్రైవేటు మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు

తల్లాడ, జూన్11: వానాకాలం వ్యవసాయ సీజన్‌లో సాగుకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ జరగటం లేదు. ఫలితంగా ప్రైవేట్ మార్కెట్లో అధిక ధరలకు రైతులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విత్తనాల కోసం రైతులు రోజులతరబడి రైతువేదికలు, సొసైటీ కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగు చెందుతున్నారు. గత్యంతరం లేక ప్రైవేట్ మార్కెట్లో పచ్చిరొట్ట విత్తనాలకు రెట్టింపు ధర రైతులు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. తల్లాడ మండలంలో సుమారు 22 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. జీలుగు, పిల్లి పెసరలను ప్రభుత్వం సబ్సిడీపై సొసైటీల ద్వారా రైతులకు పంపిణీ చేస్తుండటం తెలిసిందే. 30కిలోల జీలుగు విత్తనాల బస్తా అసలు ధర రూ.2790ఉండగా ప్రభుత్వ సబ్సిడీ రూ.1674పోను రూ.1116కు, 20కిలోల పిల్లిపెసర విత్తనాల బస్తా అసలు ధర రూ.2710ఉండగా ప్రభుత్వ సబ్సిడీ రూ.1620పోను రూ.1084కు రైతులకు పంపిణీ చేస్తోంది. ప్రస్తుత సీజన్‌లో తల్లాడ మండలంలో 1400 క్వింటాళ్ల జీలుగులు, 400క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాల అవసరముంటుందని మండల వ్యవసాయ అధికారులు ప్రతిపాదనలు పంపారు.కాగా ఇప్పటివరకు మండలంలోని తల్లాడ, గంగదేవిపాడు, కుర్నవల్లి, కలకొడిమ సొసైటీలకు 999.5క్వింటాళ్ల జీలుగులు, 86.4క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు సరఫరా చేశారు. మండలానికి మరో 404 క్వింటాళ్ల జీలుగులు, 314క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు రావల్సి ఉంది. తల్లాడ సొసైటీ పరిధిలో గతనెల 28, 29 తేదీల్లో జీలుగు, పిల్లిపెసర విత్తనాల పంపిణీ రెండు రోజుల వ్యవధిలోనే పూర్తయింది. అప్పటినుంచి పచ్చిరొట్ట విత్తనాలు అందని మిగిలిన రైతులు విత్తనాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వర్షాలు కురుస్తుండటం, పచ్చిరొట్ట విత్తనాలు రాకపోవడంతో కొందరు రైతులు విసుగుచెంది అధిక ధరలకు ప్రైవేట్ మార్కెట్లో పచ్చిరొట్ట విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.



అధిక ధరలకు కొనుగోలు చేశా
తోట వెంకటేశ్వర్లు, రైతు, బాలపేట



నేను ఐదెకరాల్లో పిల్లిపెసర కోసం ఏఈవో వద్ద ఆన్‌లైన్ చేయించాను. పదిరోజుల నుంచి సొసైటీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. అయినప్పటికీ పిల్లిపెసర విత్తనం దొరకలేదు. తల్లాడలో ఓ ప్రైవేట్ మార్కెట్లో కిలోకు రూ.50 అధిక ధరను చెల్లించి కొనుగోలు చేశాను.

సరిపడా విత్తనాలు సరఫరా చేయాలి
దాసరి శ్రీనివాసరావు, రైతు, మల్లవరం



వ్యవసాయ సీజన్ ఆరంభంలోనే పచ్చి రొట్ట విత్తనాలు దొరక్క ఇబ్బంది పడుతున్నాం. రైతుల అవసరాలకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేయాలి. వ్యవసాయ అధికారులు పంపిన ప్రతిపాదనల మేరకు మండలానికి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

మూడు నెలల వేతనాలు పెండింగ్

- ఇబ్బందుల్లో మిషన్ భగీరథ కార్మికులు
- సమ్మెకు దిగుతామని హెచ్చరికలు



మధిర, జూన్11: మూడు నెలలకుగా వేతనాలు అందక మిషన్ భగీరథ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఏనెలకానెల జీతం వస్తే పూటగడిచే వీరికి ప్రతీనెల ప్రభుత్వ నిధులతో సంబంధంలేకుండా వేతనాలు ఇచ్చే ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీ కంపెనీ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ క్రింద పనిచేస్తున్నారు. వీరికి కాంట్రాక్టర్ ఇచ్చేది నెలకు రూ.13వేలనుంచి 14వేల రూపాయల జీతమే. అవి కూడా మార్చి నుంచి మూడు నెలలుగా ఇవ్వడంలేదు. జిల్లా వ్యాప్తంగా 460 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇలా సుమారుగా రూ.3కోట్లరూపాయలు జీతాలు జిల్లా వ్యాప్తంగా కార్మికులకు పెండింగ్ ఉన్నాయి. ఎర్రని ఎండల్లోకూడా వీరు పనిచేసి ప్రజలకు త్రాగునీరు అందించడంలో కీలకంగా పనిచేశారు. అలాంటిది వీరికి వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులుపెడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వారి పిల్లలను పాఠశాలలకు పంపేందుకు పుస్తకాలు, దుస్తులు కొనేందుకు జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులుపడుతున్నారు. ప్రభుత్వం నుంచి గ్రాంట్ వచ్చినా తమకు జీతాలు ఇవ్వకుండా కంపెనీ యాజమాన్యం అనేక ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రభుత్వ పెద్దలు చొరవ చూపించి తమకు రావాల్సిన జీతం బకాయిలు వెంటనే ఇప్పించాల్సిందిగా కోరుతున్నారు.

జీతాలు ఇవ్వకుంటే సమ్మెకు దిగుతాం
జిల్లేపల్లి బాబూరావు,
కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు

జీతాలు ఇవ్వకుండా కంపెనీ యాజమాన్యం వెట్టి చాకిరీ చేయించుకుంటోంది. పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే ఇవ్వాలి. లేకుంటే సమ్మెకు దిగుతాం. ప్రభుత్వ గ్రాంట్‌తో సంబంధం లేకుండా జీతాలు ఇవ్వాలనే అగ్రిమెంట్‌ను యాజమాన్యం తుంగలో తొక్కింది. ప్రభుత్వ పెద్దలు కల్పించుకొని తమకు జీతాలు ఇప్పించి ఆదుకోవాలి.

రైతులకు సకాలంలో సాగునీటిని అందించండి

- తామరచెరువులో రూ.3కోట్ల కుంభకోణం ?
- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లి,జూన్11: వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో చెరువులు, పంటకాలువలకు మరమ్మతులు చేపట్టి రైతులకు సకాలంలో సాగునీటిని అందించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధికారులను ఆదేశించారు. మంగళవారం సత్తుపల్లిలోని వేశ్యకాంతల చెరువు, ఎన్టీఆర్ వరద నీటి కాలువ, బేతుపల్లి చెరువు జీరో పాయింట్, గాడుదల వాగు, తామర చెరువు, ఫ్రీడమ్ పార్క్‌లను తనిఖీ చేశారు. గత ప్రభుత్వ హయంలో చేపట్టిన పనులు, భూమి, పంటకాలువలు, చెరువుల ఆక్రమణలపై అధికారులను అక్కడికక్కడ అడిగి వివరణ తీసుకున్నారు. వేశ్యకాంతల చెరువులో ఆక్రమణకు గురైన పంట కాలువలు, భూములు, ఎన్టీఆర్ వరద నీటి కాలువలో నీటి ప్రవాహం, బేతుపల్లి జీరో పాయింట్ వద్ద నీటి పారుదలతో పాటు శిథిలావస్థకు చేరిన తూమును రిపేర్ చేయాలని రైతులు కోరగా అధికారులను పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆక్రమణకు గురైన గాడుదుల వాగు పూర్తి వివరాలు తెలపాలని అధికారులను కోరారు. అనంతరం తామర చెరువు వద్దకు చేరుకుని ఇప్పటివరకు జరిగిన పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని డ్రైనేజీ వాటర్ తామర చెరువులో, పంటకాలువల్లో కలవకుండా డ్రెయినేజీ నిర్మించి మళ్లించాలని ఎమ్మెల్యేను రైతులు, స్థానికులు కోరారు. కార్యక్రమంలో ఐబీ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కే.యోగీశ్వరరావు, మునిసిపల్ కమీషనర్ మందా రవిబాబు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన తామర చెరువు కట్ట, మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన ఫ్రీడమ్ పార్క్ పనులకు సంబంధించి సుమారు రూ.3కోట్ల కుంభకోణం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆరోపించారు. ఈ విషయమై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఎమ్మెల్యేను కోరారు. జేవీఆర్ పార్క్, ఇతర పల్లె ప్రకృతి వనాల పరిస్థితి కూడా అలాగే ఉన్నాయని స్థానికులు ఆరోపించారు.


తామర చెరువు వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నిధులు కాజేశారని గ్రామ సమాఖ్య సభ్యుల ఆందోళన



ఎర్రుపాలెం, జూన్ 11: మండలంలోని వెంకటాపురం శ్రీనిధి గ్రామ సమాఖ్య నిధులు గ్రామ దీపిక కాజేశారని గ్రూపు సభ్యులు జమలాపురం యూనియన్ బ్యాంక్ ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. వెంకటాపురం గ్రామానికి చెందిన శ్రీకృష్ణ గ్రామసమాఖ్య గ్రామదీపిక కుంపటి కన్నయ్య గ్రామంలోని స్వయం సహాయక సంఘాలకు చెందిన రూ.30 లక్షలు నిధులను గ్రామ సమాఖ్య సభ్యులకు తెలియకుండా వాడుకున్నారని ఆందోళన చేపట్టారు. ఈ విషయమై సభ్యులందరు శ్రీనిధి అధికారుల ముందు నిలదీశారు. తాను సదరు నగదును వ్యక్తిగతంగా వినియోగించుకున్నానని ఒప్పుకున్నాడు. నెల రోజుల్లో వడ్డీతో సహా సమాఖ్య ఖాతాలో జమచేస్తానని కన్నయ్య చెప్పటంతో గ్రూపు సభ్యులు ఆందోళనను విరమించారు. గ్రామ సమాఖ్యలు తరచు బ్యాంక్ వద్దకు వచ్చి లోన్ చెల్లింపులను చూసుకోవాల్సిన బాధ్యత స్వయం సహాయక సంఘాలదేనని బ్యాంక్ మేనేజర్ శ్రీనాథ్ తెలిపారు.

జేఈఈలో ర్యాంకర్లకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న యాజమాన్యం

మధిర, జూన్ 11: జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు జల్లా పూజిత, రేగళ్ల సాయి, కౌసిక్ రెడ్డి, సీహెచ్ సాయి కుష్మితలను భరత్ యాజమన్యం మంగళవారం కళాశాలలో ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ శీలం వెంకటరెడ్డి, కరస్పాండెంట్ శీలం విద్యాలత మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్ , అడ్వాన్స్ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబర్చి దేశంలో ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీల్లో సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. మున్ముందు కూడా ఇలాగే ప్రతిభను చాటి అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు బ్రహ్మారెడ్డి, విశ్వనాథం, సంగారావు, కళాశాల ప్రిన్సిపాల్స్ కోటేశ్వరరావు, రవీందర్‌రెడ్డి, శశికళ, నాగరాజు, అజీమ్, భవాని, రాజ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



వైరా, జూన్11: మండలంలోని పాలడుగు పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం జరుపుకున్నారు. ఆ ఆగ్రామానికి సమీపంలోని శ్రీపులిగొండ లక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో పాలడుగు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 23ఏళ్ల నాటి పదోతరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. గతస్మృతులను నెమరవేసుకున్నారు. ఆ విద్యార్థులు గద్దల లక్ష్మాద్రీ, మోదుగువినోద్‌కుమార్, మహేశ్వరరావు, పర్విన్, శ్రీవాణి, కృష్ణవేణి, వెంకట్రావ్, రవి పాల్గొన్నారు.

16న 'నెలనెల వెన్నెల'

ఖమ్మంసాంస్కృతికం, జూన్11: భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతీనెలా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమం నెలనెల వెన్నెల ఈనెల 16న జరుగనుంది. సాయంత్రం 6గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో న్యూస్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్ విజయవాడ కళాకారులచే కపిరాజు నాటిక ప్రదర్శించనున్నారు.

కారేపల్లికి చేరిన పాఠ్యపుస్తకాలు

కారేపల్లి, జూన్11: ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్ మంగళవారం కారేపల్లికి చేరాయి. మండలంలో మొత్తం 86 పాఠశాలలకు 21.500 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా 16.479 పుస్తకాలు వచ్చాయి. మిగిలిన పాఠ్యపుస్తకాలు త్వరలోనే వస్తాయని ఎంఈవో తెలిపారు.

కేంద్ర మంత్రులను కలిసిన బీజేపీ నాయకులు

ఖమ్మంరూరల్, జూన్11: కేంద్ర మంత్రులు బండి సంజయ్‌ను, కిషన్‌రెడ్డిలను డిల్లీలో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన బీజేపి నాయకులు జిల్లా నాయకులు నకిరికంటి వీరభద్రం, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జ్ సాయిరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నలమాస శ్రీనివాస్ గౌడ్ లు మంగళవారం కలిశారు. మంత్రులకు శాలువాలు కప్పి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు వాహనాల వేలం

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్11: ఖమ్మం రెండో పట్టణ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇటీవల పట్టుబడిన 3ద్విచక్ర వాహనాలను బుధవారం వేలం వేస్తున్నట్లు సీఐ చంద్రమోహన్ మంగళవారం ప్రకటించారు. ఖమ్మం టీడీపీ కార్యాలయం సమీపంలోని ఎక్సైజ్ 1టౌన్ పోలీసుస్టేషన్ వెనుక భాగంలో ఉన్న డీటీఎఫ్ కార్యాలయంలో వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

చింతకాని మండలానికి తాగునీటి సరఫరా బంద్

చింతకాని, జూన్ 11: మండల పరిధిలోని 26 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే మిషన్ భగీరథ మెయిన్ పైపు లైన్ లీకేజీ కారణంగా మండల పరిధిలోని అన్ని గ్రామాలకు రెండు రోజుల పాటు మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. లీకేజీ మరమ్మతులు పూర్తి చేసిన అనంతరం సరఫరా పునఃప్రారంభిస్తామన్నారు.

బడులు పరిశీలించిన ఏఐఎస్ఎఫ్ బృందం

ఖమ్మంసంక్షేమవిభాగం,జూన్11:ఖమ్మంలోని ప్రభుత్వ బడులను మంగళవారం ఏఐఎస్ఎఫ్ బృందం పరిశీలించారు. నివేదికలను తయారు చేశారు. బుధవారం నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్నా సౌకర్యాలు మాత్రం అందుబాటులోకి రాలేని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు ఇటికాల రామకృష్ణ పేర్కొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత

ఖమ్మంకలెక్టరేట్,జూన్11:హెల్పింగ్‌హాండ్స్ ఆధ్వర్యంలో విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను వితరణ చేశారు. సంస్థ సభ్యులు మద్దినేని ప్రసాదరావు, కమల సహకారంతో డిగ్రీ చదువుతున్న యేగినాటి హారికకు రూ.40 వేల లాప్‌టాప్‌ను మంగళవారం కలెక్టర్ వీపీ గౌతమ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ బాధ్యులు కొంగర పురుషోత్తమరావు, రాయల నరసింహారావు, యలమద్ది వెంకటేశ్వర్లు , మద్దినేని రవి, ఎగినాటి మాధవరావు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జూన్11: నాయీ కార్పొరేషన్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పిలుపు నిచ్చారు. మంగళ వారం వైరా మునిసిపాలిటీ పరిధిలో జరిగిన నాయీ బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు నాయీ బ్రాహ్మణులు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు, నాయకులు కుదురుపాక దర్గయ్య, మోహన్‌రావు, శ్రీకాకుళం శ్రీరంగం, శ్రీను, కుదురుపాక శ్రీను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాషా పండితుల అప్‌గ్రేడేషన్‌కు సహకరిస్తాం

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్11: పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు సహకరిస్తామని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులను నగరంలోని ప్రజాభవన్‌లో మంగళవారం జిల్లా బాషా పండితులు కలిసి వినతి పత్రం అందించారు. సమస్యను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారని పండితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, రవీందర్, అనిల్, బషీర్, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి
సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

కామేపల్లి, జూన్11: ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం పింజరమడుగు సీపీఎం మండల కమిటీ వింజం నాగభూషణం అధ్యక్షతన జరిగింది. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని, రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. తక్షణమే ఉపాధి కార్మికులకు రోజులకు రూ.600 కూలీ ఇవ్వాలని, 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దుగ్గి క్రిష్ణ, మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డి, బాదావత్ శ్రీను, కిన్నెర రామచంద్రయ్య, కాటిన్ని క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలి: సీపీఎం

కొణిజర్ల,జూన్11: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం దృష్టి పెట్టాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మంగళవారం కొణిజర్లలో జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, నాయకులు మోత్కూరు వెంకటేశ్వరరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, చింతపల్లి ప్రసాద్, రోషన్‌బేగ్, చిన్నదానయ్య, జొన్నబోయిన అంజయ్య, తాళ్ళపల్లి విజయ పాల్గొన్నారు.

సత్తుపల్లి ఆర్టీసీ సేవలు అభినందనీయం

- సత్తుపల్లి రూరల్ సీఐ వెంకటేష్

కల్లూరు,జూన్11: సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రయాణీకులకు అనేక సేవలు అందిస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని సత్తుపల్లి రూరల్ సీఐ వెంకటేష్ అన్నారు. సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వేసవికాలం 70రోజుల పాటు దాతల సహకారంతో అందించిన ఉచిత మజ్జిగ పంపిణీ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. ప్రయాణీకుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ, కూలింగ్ మినరల్ వాటర్ పంపిణీ చేశామని మేనేజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. కూలింగ్ మినరల్ వాటర్‌ను అందించిన దాత ఆళ్లకుంట నరసింహారావును, విలేజ్‌బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావును సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, మాజీ జడ్పీటీసీ లక్కినేని రఘు, పంచాయతీ ఈఓ కృష్ణారావు, శామ్యూల్, దార రంగ, ఉస్మాన్, త్రినాద్, రాము యాదవ్, కిషోర్, చలువాది నాగేష్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న రూరల్ సీఐ వెంకటేష్

డిమాండ్ మేరకు బస్‌సర్వీస్‌లను పెంచాలి
పీవోడబ్ల్యూ,పీవైఎల్ నిరసన

ఖమ్మంసంక్షేమవిభాగం,జూన్11: డిమాండ్ మేరకు అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్‌లను నడిపించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్ సర్వీస్‌లను పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం డిపో మేనేజర్ కార్యాలయం ఎదుట పీవోడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. డీఎం శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. నాయకులు రాకేష్, ప్రేమ్‌సింగ్, ఝాన్సీ, శోభ, సురేశ్, రవీందర్, పూలమ్మ, లలిత పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లలో బస్సు సర్వీసులను పెంచాలని ప్రగతిశీల మహిళ సంఘ జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత ఆర్టీసీ సంస్థను కోరారు. మంగళవారం సత్తుపల్లిలోని డీఎం కార్యాలయాన్ని పీవోడబ్ల్యూ, పీవైఎల్ సంఘాల ఆధ్వర్యంలో ముట్టడించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, పరిమళ, వెంకటనర్సమ్మ, కామేష్, అలవేలు, వెంకటమ్మ, దుర్గ, రామకృష్ణ, గంటా శ్రీను, అమర్లపూడి శరత్ పాల్గొన్నారు.

సీతారావమ్మకు మంత్రి పొంగులేటి నివాళి

ఖమ్మంసంక్షేమవిభాగం,జూన్11: కాంగ్రెస్ సీనియర్ నాయకులు పరుచూరి మురళీ మాతృమూర్తి పరుచూరి సీతారావమ్మ(82) మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పరుచూరి మురళీ నివాసానికి వెళ్లి సీతారావమ్మకు అర్పించారు. రాష్ట్ర విద్యా సౌకర్యాల సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల నరేందర్, పైడిపల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.